క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

హనుమంతునిపాడు: మండలంలోని గాయం వారిపల్లెలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ముఖ్య అతిథిగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ గాయం సావిత్రి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీపీ కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వాయిదా

ఉలవపాడు: మండల పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటన వాయిదా పడినట్లు ఎంపీడీఓ చెంచమ్మ గురువారం తెలిపారు. అధికారులకు డివిజన్‌లో సమావేశం ఉన్నందున రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ప్రజాస్పందన కార్యక్రమం కూడా జరగడం లేదన్నారు. మండల పరిధిలోని ప్రజలు, అధికారులు గమనించాలని కోరారు.

వైభవంగా అమ్మవారి కొలుపులు



పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో గురువారం నాగారపు ఎల్లమ్మ అమ్మవారి కొలుపులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నాగారపు వెల్లమ్మకు భక్తులు ఆచార సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పొంగళ్లను పొంగించారు. పొంగళ్లను గ్రామోత్సవం నిర్వహించుకుంటూ గుడిలో అమ్మవారికిసమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

జగనన్న సురక్ష పకడ్బందీగా నిర్వహించాలి

ఉలవపాడు: జగనన్న సురక్ష పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. మండల పరిధిలోని పెదపట్టపుపాలెం, చాకిచర్ల గ్రామాల్లో జరిగిన అవగాహనా సమావేశాల్లో వారు మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని తెలిపారు.

ఉలవపాడు: మండలంలో జూలై 1 నుంచి జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. 1న వీరేపల్లి, చాగల్లు, 4న బద్దిపూడి, రామాయపట్నం, 7న చాకిచర్ల, పెదపట్టపుపాలెం, 11న భీమవరం-1, భీమవరం- 2, 13న మన్నేటికోట, ఆత్మకూరు, 15న కరేడు-1, 18న కరేడు-2, 20 న కరేడు-3, 22న ఉలవపాడు-1, 25న ఉలవపాడు-2, 27న ఉలవపాడు-3లో సభలు జరుగుతాయన్నారు. ప్రజలకు సంబంధించిన వినతులు, సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొట్టిన ట్రాలీ

ఉలవపాడు: ముందు ఆగి ఉన్న లారీని వెనుక నుండి ట్రాలీ ఢీకొనడంతో ట్రాలీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని జాతీయరహదారిపై చాగల్లు వద్ద గురువారం రాత్రి జరిగింది. ఎరువుల లోడుతో విజయవాడ నుంచి చెన్నైకు వెళుతున్న లారీ ఆయిల్ అయిపోవడంతో చాగల్లు బ్రిడ్జి సమీపంలో నిలిచిపోయింది. వెనుక వస్తున్న ఇనుములోడు ట్రాలీ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తమిళనాడుకు చెందిన డ్రైవర్ కలగేశన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుని హైవే అంబులెన్స్ సిబ్బంది కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

కనిగిరి రూరల్: తొలి ఏకాదశి వేడుకలను గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక సాయిబాబా గుడిలో తొలి ఏకాదశి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. దేవస్థాన కమిటీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్, దువాలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా
- కిటకిటలాడిన మసీదులు, ఈద్గా ప్రాంగణాలు



దువాలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చైర్మన్ గఫార్, ముస్లిం నాయకులు



ముఫ్తి అబ్దుల్ కలాంకు ఈద్ ముబారక్ చెప్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చైర్మన్ గఫార్, తదితరులు

కనిగిరి రూరల్: బక్రీద్ (ఈద్ అల్ అద్‌హా) పర్వదినాన్ని గురువారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పట్టణంలోని ముస్లింలంతా కొత్త దుస్తులు ధరించి, స్థానిక దర్గా మసీదు (చిన మసీదు) వద్దకు చేరుకుని, అక్కడి నుంచి దైవ ప్రవచనాలు చదువుతూ కనిగిరి పెదచెరువు వద్ద ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజులు చేశారు. ఈద్గా వద్ద ముఫ్తి అబ్దుల్ కలాం మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం.. అల్లాహ్‌పై తనకున్న దైవ భక్తిని చాటేందుకు తన ఒక్కగానొక్క కుమారుడైన ఇస్మాయిల్‌ను త్యాగం చేసేందుకు సిద్ధపడిన ఓ ఆధ్యాత్మిక ఘటనను గూర్చి తెలిపారు. దీనికి ప్రతీకగా మొదలైన ఖుర్బానీ సాంప్రదాయం గురించి వివరించారు. ప్రతి ఒక్కరు దైవం కోసం పవిత్రమైన త్యాగం చేయడానికి సిద్ధం కావాలనే సందేశాన్నిచ్చారు. బయాన్ తర్వాత ముఫ్తి బక్రీద్ ప్రత్యేక నమాజులు చదివించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

స్థానిక ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక నమాజ్, దువాలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకుని ఈద్ మాబారక్(పండుగ శుభాకాంక్షలు) తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మంచి కోసం, మానవ సంక్షేమం కోసం, ధర్మకోసం, తన అవసరాలను త్యజించి ..ఎంతో కొంత త్యాగం చేయాలనే దైవ సందేశాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు షఫీ ఆజాద్, సయ్యద్ రిజ్వాన ఖాలక్, అంజుమన్ కమిటీ నాయకులు ఎస్‌కే ఖాశింసా, సయ్యద్ యాసీన్, ఈద్గా కమిటీ నాయకులు ఎస్‌కే సిలార్ సాహెబ్, మాజీ కౌన్సిలర్ ఎస్‌కే ఫయాజ్, ఎస్‌కే మస్తాన్‌వలి, ఎస్‌కే మన్సూర్, ఎస్‌కే నాగూర్‌వలి, డాక్టర్ ఫిరోజ్, ఖాద్రు, డీలర్ ఖాజ, మాజీ వార్డు సభ్యుడు నాయబ్ రసూల్, ఎస్‌కే షరీఫ్, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే లతీఫ్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని అలీ మసీద్‌లో జరిగిన ప్రత్యేక నమాజ్, బయాన్‌ను మౌలాన రబ్బాని సాహెబ్, చోటి మసీద్‌లో జరిగిన ప్రత్యేక నమాజ్, బయాన్‌ను మౌలాన ఖాశిం సాబ్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. దేవాంగనగర్, శంఖవరం, చింతపాలెం, ఏరువారిపల్లి, తాళ్లూరు, గుడిపాడు, బడుగులేరు, తురకపల్లి, గురువాజీపేట తదితర గ్రామాల్లో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆయా గ్రామాల్లోని మసీదులు, ఈద్గా ప్రాంగణాలు కిటకిటలాడాయి.

పామూరు: బక్రీద్ (ఈద్-ఉల్-జుహా) వేడుకలను మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్యాగానికి ప్రతీక నిర్వహించుకునే ఈ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఉపవాస దీక్షతో స్థానిక సీఎస్‌పురం రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో, విరువూరు రోడ్డులోని పెద్ద మసీదు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ ముస్లింలు తోటి వారిపట్ల స్నేహభావంతో మెలగాలని, ఇతరులకు శక్తికొలది సాయమందించి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

హనుమంతునిపాడు: మండలంలో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నందనవనం, జమాన్‌ఖాన్‌పల్లి, వీరరాంపురం, వాలిచర్ల, తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, లింగంగుంట్ల గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

వెలిగండ్ల: బక్రీద్ పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని వెలిగండ్ల, మొగళ్లూరు, కంకణంపాడు, జంగంనరసాయపల్లి, చౌడవరం, పి నాగులవరం, పి.రాళ్లపల్లి, గండ్లోపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పండుగను గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పొన్నలూరుతో పాటు చెన్నిపాడు, అగ్రహారం గ్రామాల్లో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పొన్నలూరు ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

టంగుటూరు: బక్రీద్ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న ఈద్గా వద్ద నమాజ్ చదువుకున్నారు. నమాజుల అనంతరం స్థోమత కలిగిన ముస్లింలు ఖుర్బానీ ఇచ్చారు.

సింగరాయకొండ: స్థానిక ఈద్గమిట్ట లోని దర్గా వద్ద గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కందుకూరు: ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను పట్టణంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పెద్దమసీదు, మక్కా మసీదు, జుమ్మా మసీదు, కోటకట్ట వీధిలోని ఈద్గా, జనార్దన కాలనీ తదితర ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి, సేవా నిరతకి బక్రీద్ పండుగ ప్రతీక అని, ముస్లింలు ఈ పండుగను ఎంతో పవిత్రంగా భావిస్తారని చెప్పారు. సమాజంలో భక్తి సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పండుగలు ఉపయోగపడతాయని వివరించారు. ముస్లింలు పండుగ నియమాలను కచ్చితంగా పాటించాలని, పండుగ స్ఫూర్తితో సమాజ సేవకు ముందుకు రావాలన్నారు. త్యాగానికి ప్రతీకగా పండుగను జరుపుకుంటామని, కావున ప్రతి ఒక్కరూ తమ చెడ్డ గుణాలను దూరం చేసుకుని త్యాగం చేయాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుసుకున్నారు.



పామూరు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



సింగరాయకొండ ఈద్గమిట్ట దర్గా వద్ద..



టంగుటూరులో ఈద్గా నమాజు చదువుతున్న ముస్లింలు



ఈద్గా వద్ద బయాన్ చేస్తున్న ఇమామ్

టీడీపీ ఎమ్మెల్యే స్వామి ఓటమి ఖాయం

- వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- గడప గడపకు మన ప్రభుత్వంలో వరికూటి అశోక్‌బాబు

మిట్టపాలెం (కొండపి): వచ్చే ఎన్నికల్లో కొండపి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని, స్థానిక ఎమ్మెల్యే స్వామి ఓటమిఖాయం అని కొండపి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. మండలంలోని మిట్టపాలెం గ్రామంలో గురువారం అశోక్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి నిర్వహించారు. గ్రామానికి వచ్చిన అశోక్‌బాబు దంపతులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పోకూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ముందుగా అశోక్‌బాబు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని సీఎం జగనన్న సాకారం చేస్తున్నారని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నారని అన్నారు. ప్రజాభిమానంతో సీఎంగా జగనన్నే తిరిగి వస్తారని ఇది ప్రజలందరి విశ్వాసం అన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని గ్రామంలో గడప గడపకు తిరుగుతూ వివరించారు. మాదిగపల్లె కాలనీలో వలంటీర్లు యాప్‌లో అప్‌లోడ్ చేయకపోవటంతో 18 మంది అర్హులకు చేయూత డబ్బులు ఆగిపోయినట్లు స్థానికులు తన దృష్టికి తెచ్చారని.. దీనిపై కొంత మంది కావాలనే హడావిడి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పోకూరి కోటేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావ్, కొండపి, పొన్నలూరు జెడ్పీటీసీలు మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ గొట్టిపాటి మురళి వివిధ గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మిట్టపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వంలో వరికూటి అశోక్‌బాబు, లక్ష్మీ దంపతులు

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

కొండపి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించి జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు గురువారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం తెలిపింది. కొండపి మండల జేసీఎస్ ఇన్‌చార్జిగా గొట్టిపాటి మురళి, మర్రిపూడి మండలానికి పూనూరి సంజీవరెడ్డి, పొన్నలూరుకు పిల్లి తిరుపతిరెడ్డి, సింగరాయకొండకు తన్నీరు సుబ్బారావు, టంగుటూరుకు చింతపల్లి హరిబాబు, జరుగుమల్లి మండలానికి తాటికొండ రామచంద్రరావును నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలోని కనిగిరి మున్సిపాలిటీకి వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, కనిగిరి మండలానికి అట్లా రామచంద్రారెడ్డి, పామూరుకు ఎస్‌కే ఖాదర్‌బాష, సీఎస్‌పురంకు బైరెడ్డి తిరుపతిరెడ్డి, పీసీపల్లికి శీలం సుదర్శన్, వెలిగండ్లకు పొల్లా సుబ్రహ్మణ్యం, హనుమంతునిపాడుకు మద్ది తిరుపతయ్యలను నియమించారు.

కందుకూరు: వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల, మున్సిపాలిటీల ఇన్‌చార్జిలను పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. వీరిలో కందుకూరు మున్సిపాలిటీ జేసీఎస్ ఇన్‌చార్జిగా ముప్పవరపు కిశోర్, కందుకూరు మండల ఇన్‌చార్జిగా చీమల వెంకటరాజాను నియమించారు. అలాగే గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాల ఇన్‌చార్జిలుగా గాజుల కిశోర్, వరికూటి కృష్ణారెడ్డి, వెలిచర్ల ధనకోటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వర్లును నియమించారు.

కాన్వెంట్‌లకు దీటుగా అంగన్‌వాడీ విద్య

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణతో అంగన్‌వాడీ కేంద్రాలు కాన్వెంటులకు దీటుగా పనిచేస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి, సర్పంచ్ మెడబలిమి గురవయ్య అన్నారు. మండలంలోని చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలు 3 నుంచి 6 ఏళ్ల లోపు వారిని ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంకు పంపి వారు కేంద్రంలో ప్రీ ప్రైమరీ విద్యను అభ్యసించడంతోపాటు మంచి పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం లేకుండా అంకితభావంతో పనిచేయాలన్నారు. అనంతరం ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న కార్యకర్త సీహెచ్.వెంకటరమణమ్మ దంపతులను ఐసీడీఎస్ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. సీఐటీయూ నాయకులు అల్లాబక్షు, వైఎస్సార్ సీపీ ఐటీ, యూత్ విభాగం నాయకులు కేతు ఎస్.వి.బ్రహ్మారెడ్డి, నగిలి ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, లక్ష్మి, దేవిశ్రీ, సువార్తమ్మ పాల్గొన్నారు.



వెంకట రమణమ్మను సన్మానిస్తున్న సూపర్‌వైజర్

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని సామూహిక వ్రతాలు

పామూరు: తొలి ఏకాదశి (ఆషాడశుద్ధ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రమా సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 131 దంపతులచేత అర్చకులు చిమట కార్తీక్‌లు వేదమంత్రాలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అదేవిధంగా వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాము, మాజీ సర్పంచ్ డి.వి.మనోహర్‌లను దేవస్థాన కమిటీ ఘనంగా సన్మానించింది.

కందుకూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దబజార్‌లోని వేణుగోపాలకృష్ణాలయంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని తులసీ దళాలతో ప్రత్యేకంగా అలకరించారు. స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం మహిళలతో గీతా గానామృతాన్ని ఆలపించారు.

వల్లూరమ్మ ఆలయంలో పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరు గ్రామంలో వేంచేసిఉన్న వల్లూరమ్మ ఆలయంలో, అన్ని గ్రామాల ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లూరమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చనలు, తులసి పూజలు చేశారు. ఆలయ ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పీసీపల్లి: మండలంలోని అన్ని శైవక్షేత్రాల్లో గురువారం భక్తులతో కిటకిటలాడాయి. తొలి ఏకాదశిని పురస్కరించుకొని మండల పరిధిలోని పంచలింగాలకొండ, పెదయిర్లపాడులో మల్లేశ్వర స్వామి దేవస్థానంలో, పెదఅలవలపాడులో ఉమామహేశ్వర దేవస్థానంలో భక్తులు భారీగా పాల్గొని పూజలు చేశారు.

వెలిగండ్ల: తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని గురువారం పలు గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు చేశారు. తొలి ఏకాదశి రోజున పూజలు నిర్వహిస్తే ఏడాది అంతా కలసి వస్తుందన్న నమ్మకంతో ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులు ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు.



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



వల్లూరులో ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి దేవస్థాన పునఃనిర్మాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో స్పందిస్తున్నారు. గురువారం పలువురు భక్తులు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో విరాళాలు అందజేశారు. కావలికి చెందిన దొడ్ల మనోహర్‌రెడ్డి, ప్రవీణమ్మ దంపతులు ఒక గ్రాము బంగారం, లింగసముద్రం మండలం వీఆర్‌కోట గ్రామానికి చెందిన వంకాయలపాటి శ్రీనివాసులు, రమణమ్మ దంపతులు 2 గ్రామాల బంగారానికి విలువైన రూ.12,501, వలేటివారిపాలెం మండలం కొండసముద్రం గ్రామానికి చెందిన మన్నెం వెంకటరమేష్, వెంగమ్మ దంపతులు రూ.6,250 ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ పునర్నిమాన కమిటీ సభ్యులకు అందజేశారు. తోకల కొండయ్య, పబ్బిశెట్టి శివ, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు అందజేసిన భక్తులతో ఎమ్మెల్యే మానుగుంట

ఏకలవ్య మహారాజ్ విగ్రహానికి భూమిపూజ



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కనిగిరి రూరల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఏకలవ్య మహారాజ్ విగ్రహానికి గురువారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ఏకలవ్యుడు విలువిద్య సంపన్నుడు, యుగపురుషుడు అని కీర్తించారు. తొలుత ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, శ్రీరామ్ సతీష్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవరాజ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ రామనాగేశ్వరరావు, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం



నగదు అందచేస్తున్న ఇస్కాన్ సభ్యుడు గుత్తి శ్రీధర్

కనిగిరి రూరల్: ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు పేదలకు గురువారం ఆర్థిక సాయం చేశారు. ఇస్కాన్ సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్, డాక్టర్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా చిరువ్యాపారులు బసవయ్య, సుబ్రహ్మణ్యంలకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయం చేశారు. మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ నాయబ్ రసూల్, పసుపులేటి అరుణోధర్, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, మానవతా సంస్థ అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఐవీ నారాయణ, బొట్టు శ్రీను, కేతనబోయిన పెద్దన్న, ద్రోణాదుల చెంచులు, పచ్చవ శేఖర్, ఎల్ఐసీ నారాయణ పాల్గొన్నారు.